నేడు కేంద్రమంత్రి సీతారామన్ జిల్లా పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు విజయవాడ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి 12 గంటలకు పెనుగొండ చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 12:45 వరకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నరసాపురం చేరుకుని రెండు గంటల నుండి మూడు గంటల వరకు నరసాపురం మున్సిపల్ అతిథి గృహంలో బస చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుండి 3.45 వరకు పిఎంలంకలోని డిజిటల్ కమ్యూనిటీ సెంటర్‌ను సందర్శించనున్నారు. అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్తారని సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

మోతాదుకు మించి..!

రబీ సాగులో ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. నాట్లు ఆలస్యం కావడంతో వరి దుబ్బులు త్వరగా తయారు కావాలన్న భావనతో ఎరువులను పెద్దఎత్తున వేస్తున్నారు. గుళికలు, పురుగుమందుల వాడకం సైతం అదేరీతిన కొనసాగుతోంది. దీంతో రబీలో పెట్టుబడి ఖర్చు భారీగా అవుతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. నాట్లు ఆలస్యంతో రబీ దిగుబడులపై రైతుల్లో గుబులు నెలకొనడం, పెట్టుబడులు అధికమవుతున్న తీరు అన్నదాతను తీవ్రంగా కలచివేస్తోంది.

- రబీలో భారీగా యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వాడకం
- ఎకరాకు 7 నుంచి 8 బస్తాలు వినియోగం
- గుళికలు, పురుగు మందుల వాడకం అధికమే
- నాట్లు ఆలస్యం కావడమే ఈ పరిస్థితికి కారణమా?
- రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ విఫలం
- రబీ దిగుబడులపై రైతుల్లో గుబులు
- ఎకరాకు రూ.45 వేలు వరకూ పెరిగిన పెట్టుబడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలవ్యాప్తంగా రబీలో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. డిసెంబర్ మొదటివారంలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో రబీసాగుపై తీవ్ర ప్రభావం పడింది. ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేసి రబీ నారుమడులు వేసేసరికి డిసెంబర్ నెలాఖరైంది. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు 25 రోజుల వరకూ నాట్లు ఆలస్యమయ్యాయి. ఫిబ్రవరి పదో తేదీ వరకూ రబీ నాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. నాట్లు ఆలస్యం కావడంతో పంట ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మే నెలాఖరు వరకూ రబీ మాసూళ్లు సాగే అవకాశం ఉందని రైతుల అంచనా. దీంతో వరిపైరు త్వరగా ఎదిగేలా చేయాలని రైతులు భావిస్తున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎరువుల వాడకం భారీగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరాకు గతంలో నాలుగు బస్తాల ఎరువులు మాత్రమే వాడేవారు. ఇప్పుడు ఏకంగా ఏడు నుంచి ఎనిమిది బస్తాల వరకూ ఎరువులు వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనిలో సగం యూరియా, మరో సగం డిఎపి, 28-28-0, 14-14-0 వంటి కాంప్లెక్స్ ఎరువులను వాడుతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల బస్తా రూ.1700 పలుకుతోంది. ఈసారి ఎకరాకు రెండు బస్తాలు అదనంగా వేస్తుండటంతో ఎరువుల నిమిత్తమే రూ.నాలుగు వేలు పెట్టుబడి అదనంగా అవుతుందని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట అనుకున్న సమయానికి పక్వానికి రాకపోతే నీటిఎద్దడి సమస్య తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో 20 రోజుల వ్యవధిలోనే ఎకరాకు నాలుగు బస్తాలకుపైగా ఎరువులు వేస్తున్నారు. ఎరువులతోపాటు గుళికలు, పురుగుమందుల నిమిత్తం సైతం రైతులు పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నారు. ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. దీంతో గతంతో పోలిస్తే ప్రస్తుత రబీ సీజన్‌లో పెట్టుబడి ఖర్చు వరిసాగులో ఎకరాకు రూ.ఐదు నుంచి రూ.ఆరు వేల వరకూ పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఈసారి ఎకరాకు రూ.45 వేలు వరకూ పెట్టుబడి అవనున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంత పెద్దఎత్తున పెట్టుబడి ఖర్చు పెడుతున్న రైతులకు రబీ దిగుబడులపై లోలోన గుబులు నెలకొంది. నాట్లు ఆలస్యం కావడంతో దిగుబడిపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే తీవ్ర నష్టాలు తప్పవని లోలోన ఆందోళన చెందుతున్నారు. కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లో భూములతోపాటు వివిధ మండలాల్లో శివారు భూములకు నీటిఎద్దడి సమస్య వస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుందని అన్నదాత భయపడుతున్నాడు. ఎరువులు, పురుగుమందుల వాడకం పెరిగిపోవడం సైతం పంట దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఖరీఫ్‌లో తుపాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన రైతులంతా రబీసాగుపైనా ఆశలు పెట్టుకున్నారు. రబీ పంట సక్రమంగా చేతికి అందకపోతే జిల్లా రైతాంగం కోలుకోలేని దెబ్బతినే పరిస్థితి ఏర్పడనుంది.

'పోలవరం'లో మళ్లీ పులి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో ప్రగడపల్లి పంచాయతీ గార్లగొయ్య సమీపంలో పంట పొలాల్లో సోమవారం పులి పాదముద్రలు కనిపించడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సుమారు నెల రోజులుగా ద్వారకాతిరుమల, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో పశువులపై పులి దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. తర్వాత పులి పాపికొండల్లోని అభయారణ్యంలోకి వెళ్లిపోయిందని అంతా భావించారు. అయితే తాజాగా గార్ల గొయ్యి సమీపంలో పంట పొలాల్లో పులిపాద ముద్రలు కనిపించడంతో రైతులు అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అటవీ అధికారులు పాదముద్రలు పులివేనని నిర్ధారించారు. ఈ సందర్భంగా అటవీ శాఖాధికారి ఎన్. దావీదురాజు మాట్లాడుతూ పంట పొలాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వలన పులి వచ్చి ఉంటుందన్నారు. సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను అడవుల్లోకి వెళ్లి మేపరాదని, అటవీ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో సంచరించొద్దని సూచించారు. పులి కదలికలపై నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి

స్పందన కార్యక్రమంలో ఎఎస్‌పి స్వరూపరాణి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎఎస్‌పి స్వరూపరాణి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి స్వరూపరాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఆయా పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు పూర్తిస్థాయి చర్యలు చేపట్టామన్నారు. ఆన్‌లైన్‌లో మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫోన్లకు మెసేజుల్లో వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు.

స్పందన ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

ఆర్‌డిఒ భవానిశంకరి

నూజివీడు రూరల్ :నూజివీడు పట్టణంలో సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ భవానిశంకరి మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న అర్జీలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. స్పందన సమస్యలను పరిష్కరించాలని, పరిష్కారం కాకుంటే లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు.

పవన్ ప్లానేమిటో..!

- 21న భీమవరం పర్యటన నేపథ్యంలో సర్వత్రా చర్చ
- జనసేన, టిడిపి ముఖ్య నేతలతోపాటు ప్రముఖులతో సమావేశం
- భవిష్యత్తు కర్తవ్యాలపై సుదీర్ఘ చర్చ
- పలు కీలక అంశాలు ప్రకటించే అవకాశం
- భీమవరం నుంచి పోటీపై క్లారిటీ ఇచ్చేనా?

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తారా.. లేక వేరేచోట నుంచి పోటీలో ఉంటారా.. జిల్లాలో ఎన్ని సీట్లలో జనసేన పోటీలో ఉండే అవకాశం ఉంది.. అసలు పవన్ వ్యూహం ఏమిటనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పవన్ భీమవరం పర్యటన ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో కొన్ని కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే పవన్ భీమవరం పోటీ నుంచి చేస్తారా, లేదా అనేదే హాట్ టాపిక్‌గా మారింది.

మరికొన్ని రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఎత్తులు, పైఎత్తులతోపాటు వ్యూహాత్మకంగా ముందుకు సాగేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పవన్‌కళ్యాణ్ భీమవరం పర్యటనకు వస్తున్నారు. ఈ నెల 14న భీమవరంలో పర్యటించాల్సి ఉన్నా చివరి నిమిషంలో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో పర్యటన వాయిదా పడింది. ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో ఈ నెల 21న పవన్ భీమవరం పర్యటన ఖరారైంది. భీమవరంలోని కాస్మోపాలిటిన్ క్లబ్ సమీపంలో పవన్ హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు హెలీప్యాడ్‌ను నేతలు సిద్ధం చేశారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో భీమవరం శివార్లలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్‌కు చేరుకోనున్నారు.

గతేడాది జూన్ 25న పవన్ జిల్లాలో పర్యటించారు. వారాహి యాత్రలో భాగంగా భీమవరం పర్యటనకు వచ్చిన పవన్‌కళ్యాణ్ ఐదు రోజులపాటు భీమవరం కేంద్రంగానే పార్టీ కార్యకలాపాలను నిర్వహించారు. అనంతరం కొద్ది విరామం తర్వాత ఏలూరు జిల్లా నుంచి పర్యటన ప్రారంభించి పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకులో యాత్ర ముగించారు. సుమారు ఆరు నెలల తర్వాత పవన్ కళ్యాణ్ జిల్లాలో మళ్లీ పర్యటించనున్నారు. జనసేనాని ఉభయగోదావరి జిల్లాలపై ప్రధానంగా కేంద్రీకరించి ముందుకు సాగుతున్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలు, 13 అసెంబ్లీ స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. కేవలం రెండు స్థానాల్లో మాత్రమే టిడిపి విజయం సాధించింది. దీంతో ఈసారి ఉమ్మడి జిల్లాలో పట్టు సాధించేందుకు జనసేన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. టిడిపితో పొత్తు నేపథ్యంలో జనసేన అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. పవన్ పర్యటనలో కీలకాంశాలపై చర్చ ఉండొచ్చని తెలుస్తోంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల ఎంపిక, పొత్తులతో కలిసి వెళుతున్న సందర్భంలో ఏర్పడే ఇబ్బందులు, ఉమ్మడి కార్యాచరణ, అభ్యర్థుల గెలుపునకు అవసరమైన ప్రణాళికపై చర్చ ఉండొచ్చునని ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా అభ్యర్థుల సీట్లు కేటాయింపుపై చర్చ ఉండొచ్చునని తెలుస్తోంది. ఇప్పటికే భీమవరం, నరసాపురం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, కైకలూరు లేక ఏలూరు నుంచి జనసేన అభ్యర్థులు పోటీ ఉండొచ్చునని ఆది నుంచి పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. దీనిలో భాగంగానే జనసేన ముఖ్యనేతలకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు కొన్ని ముఖ్యమైన అంశాల్లో పవన్ ఈ పర్యటనలో దిశానిర్దేశం చేయనున్నారు. టిడిపి ముఖ్యనేతలు శ్రేణులతో ప్రత్యేకంగా పవన్ సమావేశం కానున్నారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రధాన చర్చ జరగనుంది. ముఖ్య నాయకులతో పవన్ భేటీ అనంతరం టిక్కెట్ల కేటాయింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో జనసేన బలపడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గోదావరి జిల్లాల్లో జనసేన కొంత ప్రభావం చూపించింది. ఈ జిల్లాలో కాపు సామాజిక తరగతికి చెందిన వారు ఉండటమే దీనికి కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పవన్ కూడా పదేపదే ఈసారి అసెంబ్లీలో అడుగు పెడతామని చెబుతుండటం, ఇది సాధ్యం కావాలంటే తన సామాజిక తరగతి ఓట్లు ఎక్కువ శాతం ఉన్న ఉభయగోదావరి జిల్లాల నుంచే అది సాధ్యమవుతుందనే అంచనాతో ఉన్నారని తెలుస్తోంది.

భీమవరంలో పవన్ పోటీపై ఉత్కంఠ

భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. అయితే ప్రస్తుతం పవన్ భీమవరం పర్యటన నేపథ్యంలో ఆయన ఎక్కడ నుంచి బరిలోకి దిగేదనే దానిపై ప్రకటన చేస్తారా అని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పార్టీ ముఖ్య నాయకులు, కేడర్ కూడా పవన్‌ను ఇక్కడి నుంచే పోటీ చేయాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. లోకల్, నాన్‌లోకల్ అనే భావన తీసుకొచ్చేలా అధికార పార్టీ వైసిపి సాగిస్తున్న ప్రచారానికి చెక్ పెట్టేలా భీమవరంలో పవన్ నివాసం ఉండేలా ఒక ఇంటి కోసం అన్వేషిస్తున్నట్లు తెలిసింది. దీంతో పవన్ ఇక్కడి నుంచే పోటీ చేస్తారని సాగుతున్న ప్రచారానికి బలం చేకూరింది. గత ఎన్నికల్లో పవన్ భీమవరం, గాజువాక నుంచి పోటీ చేసి పరాజయం పొందారు. అప్పటి గణాంకాల ప్రకారం నియోజకవర్గంలో 2,46,342 మంది ఓటర్లు ఉండగా మొత్తం 1,92,061 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌కు 70,642, వామపక్షాల మద్దతుతో బరిలో నిలిచిన జనసేన అభ్యర్థి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు 62,285 ఓట్లు, టిడిపి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులుకు 54,037 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ 8,357 ఓట్లు మెజారిటీతో పవన్ కళ్యాణ్‌పై విజయం సాధించారు. అయితే పోయిన చోటే వెతుక్కోవాలనే చందంగా జనసేనాని ఈసారి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ భీమవరం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వలేదు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,51,301 మంది ఓటర్లు ఉన్నారు. దీంట్లో సుమారు 75 వేల మంది కాపు సామాజిక తరగతికి చెందిన ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో నూటికి నూరు శాతం పవన్ కళ్యాణ్ ఇక్కడ నుంచే పోటీ చేసే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పవన్ పర్యటనలో స్వల్ప మార్పు

భీమవరం, భీమవరం రూరల్: జనసేన అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ భీమవరం పర్యటనలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నట్లు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవన్ పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 20న పవన్ భీమవరంలో పర్యటించాల్సి ఉందని, ప్రస్తుతం రాజమండ్రిలో జరుగుతున్న సమావేశాల్లో కొన్ని మార్పులు చోటుచేసుకోవడం వల్ల భీమవరం పర్యటన 21వ తేదీకి మార్పు జరిగిందన్నారు. జనసేన-తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో ఆయన భేటీ అవుతారని తెలిపారు. పర్యటన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడిస్తారని చెప్పారు. జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ ఎన్ని కుట్రలు చేసినా పవన్ భీమవరం రాకుండా ఆపలేరని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రచార సహాయ కార్యదర్శి బండి రమేష్ కుమార్, మండల అధ్యక్షులు మోకా శ్రీనివాస్, ఎస్ఎస్.గిరి, దారపురెడ్డి త్రివిక్రమ్, నాగిడి శ్రీనివాస్, ఏడుకొండలు, పూర్ణిమ, పెదెట్టి తేజ, తుంపలా శ్రీను, గొర్ల గోపీ, రామాయణం శ్రీనివాస్, ఉండవల్లి శ్రీను, బన్ను ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

నేడు కలెక్టరేట్ వద్ద మహాధర్నా : జెఎసి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిల సాధనకు జెఎసి చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఈ మేరకు ఉద్యోగ సంఘాల నాయకులతో జెడ్‌పి గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు, సరెండర్ లీవ్స్ ఎన్‌క్యాష్‌మెంట్, ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్, జెడ్‌పి జిపిఎఫ్‌లను సకాలంలో చెల్లించాలని, ఎపి జిఎల్ఐ లోన్స్ వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్సుమెంట్ క్లెయిమ్స్ నేటి వరకూ రాలేదన్నారు. పిఆర్‌సి కమిషన్ రిపోర్టు టైమ్‌కు రాని పక్షంలో మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించా4లని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఏలూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టే ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొనాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సమావేశంలో జెఎసి నాయకులు నెరుసు రామారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్, జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం కార్యదర్శి కప్పల సత్యనారాయ, సునీత, సత్యభారతి, మల్లిక పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్లు కేటాయించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు, నిర్వాసితులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మద్రిపాడులో కొత్తూరు నిర్వాసితులకు కేటాయించిన ఇళ్లు వారికి ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ లావణ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం పోలవరం ముంపు పేరుతో మండలంలో అభివృద్ధిని పూరి2గా నిలిపివేశారన్నారు. మాధవరం పంచాయతీ కొత్తూరులో దాదాపు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. ఒక్కరికీ కుడా మంచి ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వీరి సమస్యలు పట్టించుకుని మద్రిపాడు నిర్వాసితుల కాలనీలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే కొత్తూరు గ్రామంలో వారికి గృహాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తయ్య, సోడే సత్యవతి, మిడియం కృష్ణ, సరియం రాజమ్మ, గొంది వీర్రాజు, మిడియం పిచ్చయ్య, కొండ్రు ప్రసాద్, మడకం రమాదేవి, తోడేం కాంతమ్మ, తోడేం వెంకటమ్మ పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

అల్లూరి సీతారామరాజు కాలనీ వాసుల ధర్నా

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు భావిశెట్టిపేట, అల్లూరి సీతారామరాజు కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆ పార్టీ జిల్లా నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ 2004లో ఏలూరులో అనేక ప్రాంతాల్లో ఇల్లు లేని పేదల కోసం ప్రభుత్వ పోరంబోకు భూములను పరిశీలించి సిపిఎం పోరాటం చేసిందన్నారు. ఆ సందర్భంగా ఏలూరు వన్ టౌన్ పరిధిలోని భావిశెట్టిపేట వద్ద సుమారు వంద కుటుంబాలవారు ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఆ కాలనీకి అల్లూరి సీతారామరాజు కాలనీగా పేరు పెట్టుకుని 20 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్నారన్నారు. ఇప్పటివరకు అల్లూరి సీతారామరాజు కాలనీ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ కాలనీలో తాగునీటి పైపులైను, పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతిరోజూ మహిళలు పనులు మానుకుని వాటర్ ట్యాంకర్ కోసం ఎదురు చూడాల్సి వస్తోందన్నారు. కాలనీలో వేసిన వీధిలైట్లను సైతం తీసేశారన్నారు. వీధిలైట్లు లేక కాలనీ ప్రజలు చీకట్లో బతుకుతున్నారన్నారు. కాలనీ ప్రజల వద్ద చెత్త పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు వారికి సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు శ్రద్ధ చూపించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఈశ్వరమ్మ, సరోజినీ, అన్నపూర్ణ, కుమారి, అచ్చిత, రాజి, వెంకటలక్ష్మి, సత్యవతి, నాగు, వెంకట్, పుట్ట మీనా, వరలక్ష్మి, త్రినాథ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

పోలవరం డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్‌రెడ్డి

డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం డిఎస్‌పిగా సురేష్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, విజయవాడలో పనిచేశారు. పోలవరం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో సిఐలు, ఎస్ఐలతో స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణ, సాధారణ రోజుల్లో శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పోలవరం జిల్లా సాధన సమితి ఐక్య కార్యాచరణ సమితి నాయకులు డిఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలవరం సాధన సమితి ఐక్య కార్యాచరణ సమితి నాయకులు నాళం గాంధీ, బుగ్గ మురళీకృష్ణ, గంగు అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు, ఎస్.మోహన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎస్.రాజశేఖర్, జనసేన నాయకులు గునపర్తి చిన్ని, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు కోరసిక నాగబాబు, వైసిపి మండల ఎస్‌సి సెల్ నాయకులు ఈర్నాల జాన్‌బాబు, తుమ్మరాడ పోసిబాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల దృష్టి సారించారు. నిడమర్రు సిఐ సుభాష్, చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ సోమవారం మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ఒలతో కలిసి వసతులపై ఆరా తీశారు. వేసవి దృష్ట్యా ఓటర్లకు నీడ, తాగునీరు కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.


విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

ప్రజలకు రుణపడి ఉంటా
విద్యాధరరావు విగ్రహావిష్కరణలో ఎంపీ శ్రీధర్

ప్రజాశక్తి - చింతలపూడి

కీర్తిశేషులు తన తండ్రి కోటగిరి విద్యాధరరావును మంత్రిగా, చింతలపూడి ఎంఎల్ఎగా ఆదరించిన, తనను ఎంపిగా గెలిపించిన ప్రజలకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. లింగపాలెం మండలంలోని అశన్నగూడెం గ్రామంలో కీర్తిశేషులు కోటగిరి విద్యాధరరావు విగ్రహాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఆదేశానుసారం చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థిగా విజయరాజును, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్‌ను అందరం అఖండ మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి విజయరాజు, కోటగిరి అనిత, మార్కెట్ యార్డ్ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్, జిల్లా నాయకులు గంటా ప్రసాద్‌రావు, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ సొంగా సందీప్, పార్టీ మండలాధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న అట్లూరి ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

బాధితులకు అట్లూరి ఛారిటబుల్ ట్రస్టు సాయం

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో ఆపద ఎక్కడుంటే అక్కడ అట్లూరి ఛారిటబుల్ ట్రస్టు ఉంటుందని టిడిపి గుడిపాడు గ్రామ నాయకులు మందలపు ధర్మరాజు అన్నారు. మండలంలోని గుడిపాడులో రెండు రోజుల క్రితం పల్లి నాగేశ్వరరావు ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితులకు అట్లూరి ట్రస్ట్ ఛైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర రెండు జతల బట్టలు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, కొంతమేర ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మందలపు బుజ్జి, ధర్మరాజు, లక్కపాము కాంతారావు, పల్లి వెంకటేశ్వరరావు, సుమన్, రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ సీజన్‌లో వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంఇఒ-2 కిరణ్‌బాబు అన్నారు. పట్టణంలో శ్రీచైతన్య పాఠశాలలో తాగునీరు, శానిటేషన్, మౌలిక సౌకర్యాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట దొరికే రెడీమేడ్ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సౌకర్యాల కల్పనలో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినుల శ్రమదానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇంటర్ విద్యార్థినులు సోమవారం శ్రమదానం చేసి అభినందనలు పొందారు. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కామర్స్ లెక్చరర్ విరాళంతో లైబ్రరీ నిర్మించేందుకు ముందుకు వచ్చామని ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ తెలిపారు. తమ వంతు శ్రమదానం చేసి ఇటుకలు, ఇసుక, కంకర తదితర సామగ్రి అందించిన బాలికలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బయ్యన్నగూడెంలో భారీ చోరీ
రూ.11 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యన్నగూడెంలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. రూ.11 లక్షలు నగదు దుండగులు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బయ్యన్నగూడేనికి చెందిన మాధవరపు వరదారావు కుమార్తె వివాహం ఈ నెల 18వ తేదీ ఆదివారం రాత్రి జరుగుతుంది. ఇంట్లోవారందరూ వివాహనికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలకొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.11 లక్షల నగదును అపహరించుకుపోయారు. ఉదయం ఇంటికి చేరుకున్న వరదారావు కుటుంబసభ్యులు తాళాలు పగలకొట్టి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో 20 టన్నుల బియ్యాన్ని సోమవారం ఉంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గుంటూరు నుంచి ఉండ్రాజవరం రైస్ మిల్లుకు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ మణికుమార్ తెలిపారు. బియ్యం లారీ పట్టుకున్న అనంతరం సివిల్ సప్లై అధికారులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. రేషన్ బియ్యాన్ని ఉదయం పది గంటలకు పట్టుకున్నా సివిల్ సరఫరా అధికారులు రాత్రి ఎనిమిది గంటలైనా బియ్యం విలువ ఎంత, అక్రమ రవాణా చేసిన వారి పేర్లు వెల్లడించడంలో గోప్యత పాటించారు. ఉన్నతాధికారులు కూడా ఫోన్‌కు స్పందించలేదు. దీనిపై ఒత్తిళ్లు వచ్చినట్లు తెలుసింది.

నాలుగు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జంక్షన్‌లోని ఫలహారశాలలు, రెస్టారెంట్‌లో గృహ వినియోగానికి ప్రత్యేకించిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడే విషయాన్ని గుర్తించేందుకు పౌరసరఫరాల శాఖ సోమవారం దాడులను నిర్వహించారు. భీమడోలు పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ ఎ.మాధవరావు, విజిలెన్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో నాలుగు వంట గ్యాస్ సిలిండర్ల అక్రమ వాడకాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా రూ.9,588 విలువైన నాలుగు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని వాడుతున్న రెస్టారెంట్స్ యజమాని ఈశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పి.అంకంపాలెంలో భూ వివాదం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పి.అంకంపాలెం రెవెన్యూ పరిధిలోని 50వ సర్వే నెంబర్ ఏడు ఎకరాల వ్యవసాయ భూమిలో ఆ గ్రామంలోని గిరిజనేతరులకు రామకృష్ణపురం గ్రామానికి చెందిన గిరిజనులకు మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతుంది. ఈ భూమికి సంబంధించి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా సోమవారం మరొకసారి ఇరు గ్రూపుల మధ్య గొడవ జరిగి దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పలువురికి గాయాలు కాగా స్థానికులు వారిని జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థ సాయి హెల్పింగ్ హాండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. ఏలూరుతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విరాళాలతో పనిచేసే సాయి హెల్పింగ్ హాండ్స్ సంస్థను 15 నెలల క్రితం ఏలూరు కేంద్రంగా ఏర్పాటు చేశారు. దీనిలో ఒక సభ్యునిగా భీమడోలు మండలం పూళ్ల హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మోహన్ ఉన్నారు. ప్రతి నెలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక పేద విద్యార్థిని గుర్తించి వారు నిరంతరంగా విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు సంస్థవారు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో నివాసం ఉంటున్న ఒడిశాకు చెందిన వలస కార్మిక కుటుంబ సభ్యుడు పేద విద్యార్థి సాహూ సంతోష్‌ను ఆదుకునేందుకు సోమవారం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు విద్యార్థి ఇంటి వద్ద నిర్వహించారు. సాహూ సంతోష్ తండ్రి చనిపోవడంతో తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కుటుంబ సభ్యులుగా ఉన్న సాహు సంతోష్ వికలాంగుడు కావడంతో పని చేసే పరిస్థితి లేదు. అతను ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ ఆనర్స్(హిస్టరీ) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రభుత్వపరంగా ఫీజు రియంబర్స్‌మెంట్ సొమ్ములు విడుదల కాకపోవడంతో ఫీజు చెల్లించేంతవరకు హాల్‌టికెట్ ఇచ్చే అవకాశం లేదని కళాశాల యాజమాన్యం స్పష్టం చేసింది. విషయాన్ని తెలుసుకున్న సాయి హెల్పింగ్ సభ్యులు సంతోష్ ఇంటికి చేరుకుని రూ.ఐదు వేలు పరీక్ష ఫీజును చెల్లించారు. అతని పోషణ నిమిత్తం రూ.ఏడు వేలు నగదు అందించారు. దీనికి అదనంగా గతంలో వికలాంగుల కోటాలో మంజూరైన ట్రై సైకిల్ పాడైన కారణంగా అతను కళాశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. సాయి హెల్పింగ్ అండ్ సభ్యులు సుమారు రూ.12 వేల వ్యయంతో ట్రై సైకిల్ బాగు చేసి అందించేందుకు చర్యలు చేపట్టారు. సంతోష్ కుటుంబ సభ్యుల పోషణ కోసం ఒక నెల రోజులకు సరిపడా రేషన్, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో సాయి హెల్పింగ్ హాండ్ సభ్యులు టి.శ్రీనివాస్, ఇ.శ్రీనివాస్, డివిఎస్ఎస్.ప్రకాష్‌మోహన్ పాల్గొన్నారు.


సంతోష్‌కు సాయం చేస్తున్న సాయి హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు

మెరుగ్గానే విద్యార్థుల ఆరోగ్యం : డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జీలుగుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో అస్వస్థతకు గురైన 42 మంది విద్యార్థుల ఆరోగ్యం మెరుగ్గానే ఉందని డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వాంతులు, విరోచనాలు ఎక్కువై బాగా నీరసించిన ఇద్దరు విద్యార్థులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారని, అక్కడ పిల్లలవైద్య నిపుణులు పరీక్షించి అవసరమైన చికిత్స అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ఇద్దరి ఆరోగ్యం కూడా నిలకడగానే ఉందని తెలిపారు. మిగిలిన విద్యార్థులకు వసతిగృహంలోనే మెడికల్ క్యాంపు నిర్వహించి చికిత్స అందించారని పేర్కొన్నారు. విద్యార్థులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు.

పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలి
నేడు బహిరంగ సభ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని ఈ నెల 20వ తేదీన ఏటిగట్టు సెంటర్‌లో ఏడు వేల మందితో భారీ బహిరంగ సభ, వంటా వార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా సాధన సమితి అఖిలపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. స్థానికంగా సోమవారం నిర్వహించిన సమావేశంలో నాళ్లం గాంధీ, బుగ్గా మురళీకృష్ణ, సొబ్బన మోహన్, గంగు అనిల్ కుమార్, కరిబండి నాగరాజు, రాంబాబు మాట్లాడారు. భారీ బహిరంగ సభకు గిరిజన, వర్తక, ఉద్యోగ, కార్మిక, స్వచ్ఛంద, రిటైర్డ్, ఉద్యోగులు, అంగన్వాడీ సంఘాలు పూర్తిస్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో విధ్వంసకర పాలన : బడేటి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి విధ్వంసకరమైన పాలన సాగుతోందని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) విమర్శించారు. బడేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు జగన్ సిద్ధామా అన్నారు. రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వచ్చిన జనం పారిపోతుంటే ఆ దృశ్యాలను చిత్రీకరిస్తున్న జర్నలిస్ట్‌పై వైసిపి మూకలు మూకుమ్మడి దాడి చేయడం దుర్మార్గమన్నారు.

కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ ఛైర్మన్‌గా జంగారెడ్డిగూగేనికి చెందిన బొడ్డు శ్రీనివాసరావును నియమిస్తూ ఎపి లీగల్ సెల్ ఛైర్మన్ డాక్టర్ శాస్త్రి జంధ్యాల ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు చేతుల మీద బొడ్డు శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తాను చేసిన సేవలు గుర్తించి తనకు జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు.

మామిడి రైతులకు హెచ్ఒ సూచనలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో సోమవారం హెచ్ఒ హేమ మామిడి రైతులకు ముఖ్య సూచనలు చేశారు. మామిడి సాగులో తామర, పండు ఈగ ఉధృతి అధికంగా ఉందని, తగిన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మామిడి పూత, పిందె దశలలో సూచనలు పాటించి సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారులు, మామిడి రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన సీడ్స్ అందించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులకు నాణ్యమైన సీడ్స్ అందుబాటు ధరలో అందించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లిలోని బంటుమిల్లి రోడ్డులో రవికాంత్ రెడ్డి ఆహ్వానం మేరకు రాయల్ సీడ్స్ హ్యాచరీస్ నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమంలో సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలిదిండి ఎఎంసి వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణువర్ధన్, మర్రివాడ సుధాకర్‌రెడ్డి, మర్రివాడ వీరరెడ్డి, రాచురి కుమార్, పెయ్యేరు ఉప సర్పంచి దివి సతీష్, రాచురి గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

మారేడుబాకలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని మారేడుబాక గ్రామంలో సోమవారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

'పవన్‌పై కేసు కక్షపూరితం'

ప్రజాశక్తి - భీమడోలు

జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై నమోదు చేసిన కేసు కక్షపూరితమని, అక్రమమని జనసేన, తెలుగుదేశం పార్టీలు భీమడోలు సంత పేటలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ సమన్వయకర్త పి.ధర్మరాజు మాట్లాడారు.

21, 22 తేదీల్లో నిరాహార దీక్ష

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 21, 22 తేదీల్లో పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం ఎదురుగా జనసేన పార్టీ మండలకమిటీ ఆధ్వర్యంలో సాముహిక నిరాహార దీక్ష చేస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఈశ్వరయ్య తెలిపారు. ముఖ్యంగా మండలంలో రోడ్లు నిర్మించాలన్నారు. అన్ని గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సాముహిక నిరాహార దీక్షలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాధితులకు నిత్యావసర వస్తువులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని దాచారం పంచాయతీ పరిధిలోని పాతూరులో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇరకం ముత్తయ్యకు చెందిన పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న బిజెపి మండల ఉపాధ్యక్షులు చెరువుకట్ల సతీష్ తపన ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి తక్షణమే ఆ కుటుంబానికి తగినంత సహాయం చేయాలని ఆదేశించారు. ఆ కుటుంబానికి నిత్యావసర వస్తువులు సోమవారం అందించారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జర్నలిస్టులపై దాడులు అమానుషమని ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం బహిరంగ సభలో ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసిపి కార్యకర్తలు మూకుమ్మడిగా దాడికి పాల్పడటాన్ని ఆయన ఖండించారు. స్థానిక రోటరీ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడడం సరికాదన్నారు. జర్నలిస్టులపై దాడులు ప్రోత్సహించడం రాజకీయ పార్టీలకు సరైన పరిణామం కాదన్నారు. జర్నలిస్టు కృష్ణపై దాడికి పాల్పడినవారిపై పోలీసులు తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డివి.భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకట్, జిల్లా కార్యవర్గసభ్యులు కెవి.రమణరావు, ఎం.గంగరాజు (ఎంజిఆర్), ఎల్‌వి.నాగకుమార్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిఎం జగన్ సిద్ధం బహిరంగ సభకు వెళ్లి ఫొటోలు తీస్తున్న మీడియా ప్రతినిధి కృష్ణపై కొందరు వైసిపి అల్లరి మూకలు దాడి చేయడం బాధాకరమని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు అన్నారు. సోమవారం ఆయన అల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణపై దాడి చేసిన వారిని పోలీసులు గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వైసిపి పాలనలో మీడియాపై దాడులు ఎక్కువయ్యాయన్నారు.

చింతలపూడి : ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కోశాధికారి కె.నాగచిన్నారావు, ఎపియుడబ్ల్యూజె ఉపాధ్యక్షులు అజాద్ ఆధ్వర్యంలో చింతలపూడి ఎస్ఐ ఎస్ఐ కుటుంబరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారు పాల్గొన్నారు.

ఏలూరులో...

పోలవరం : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసిపి నాయకులు, కార్యకర్తల దాడి అమానుషమని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్ బాబు అన్నారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పూనెం చిన్న బుచ్చన్నదొర, జిల్లా జాయింట్ సెక్రటరీ కుంజం రాంబాబు, పోలవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ ఎన్.ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ టి.వెంకట్రావు, కార్యదర్శి కె.రాము, జాయింట్ సెక్రటరీ యు.సుధాకర్‌రాజు, కోశాధికారి టి.లక్ష్మణరావు,ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు స్పోర్ట్స్ : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసిపి నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్‌రావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్‌పి స్వరూపరాణికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజె, రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - మండవల్లి

అంతర్గత రహదారులను నిర్మించి గ్రామాలాభివృద్ధికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మండలంలోని లింగాల పంచాయతీ పరిధిలోని గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.15 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ చేబోయిన వీర్రాజు, ఎంపిటిసి సభ్యులు కమదన శేషతల్పారావు (నాయనబాబు) పిఏసిఎస్ అధ్యక్షులు గరికపాటి రామ్మోహన్‌రావు, శివాలయం ఛైర్మన్ రాజులపాటి యశోధరావు, సర్పంచులు జంపన వీరబాబు, నాగదాసి థామస్, బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, పుట్టి సత్యనారాయణ, పెరుమాళ్ల సత్యనారాయణ, చల్లగుల్ల వీరమోహన్‌రావు, నిరసనగట్టి కనకాచారి, ఉప్పల మైథిలి, ఫణి, బొమ్మిశెట్టి నాగశేషు, ఓలేటి నాగరాజు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో 24 గంటలూ వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - మండవల్లి

నైట్ వాచ్‌మేన్ లేరనే సాకుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాత్రి వేళలో మూసివేయడం దారుణమని, జిల్లా అధికారులు స్పందించకుంటే ప్రజలతో మమేకమై నిరాహార దీక్ష చేపడతామని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. 24 గంటలూ పిహెచ్‌సిని అందుబాటులో ఉంచి వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎఒ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలు వైద్య సేవలందించాలని ప్రభుత్వం ఆదేశించిందని, వైద్యశాలలో ఇరువురు వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారని, అయినప్పటికీ రాత్రి వేళల్లో వైద్య సేవలందడం లేదన్నారు. 24 గంటలు వైద్యసేవలందించాలని రెండుసార్లు స్పందనలో అర్జీ ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏలూరు జిల్లా పరిధిలోకి ఇంకా రాలేదని, కృష్ణాజిల్లా పరిధిలోనే ఉందని, వారే నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలని ఏలూరు జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, లేకపోతే ప్రజలతో మమేకమై వైద్యశాల ఎదుట బైఠాయించి నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు టి.అప్పారావు పాల్గొన్నారు.

పుట్రేపు రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని రుద్రకోటరాజుగూడెం వద్ద పుట్రేపు రోడ్డు అబివృద్ధి పనులను జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.75 కోట్ల పంచాయతీ రాజ్ నిధులతో టి.నరసాపురం- మక్కినవారిగూడెం అడ్డరోడ్డు నుంచి బండివారిగూడెం 3.95 కిలో మీటర్ల మేర ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ముత్తయ్య, మండల యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య, కె.రమేష్‌రాజు, బాణాల నాగేంద్ర, ఏలియా, సాగర్ పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల సంగీత ఆరాధనోత్సవం

జంగారెడ్డిగూడెం టౌన్ : జంగారెడ్డిగూడెంలో చిలుకూరి సుబ్బయాచారి ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు ఘంటసాల పాటలు పాడారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి సీనియర్ కళాకారులు, బుర్రకథ బ్రహ్మ బిరుదాంకితుడు సబ్బి కనకారావును, దూబచర్లకు చెందిన కళాకారిణి అంజలిని సత్కరించారు. అంజలికి వాసవీ క్లబ్ గోల్డ్ ఛైర్మన్ చిన్ని సాయికుమార్ ఆర్థిక సాయం అందించారు. ఈ సభలో దొంతోజు కృష్ణస్వామి బృందం పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం
ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, వేలేరుపాడు ఎంపిపి లక్ష్మీదేవి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.రామతులసి, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, తెల్లం వెంకటలక్ష్మి, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సోదం సుధాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కెవిఎస్ఎన్.కుమార్, వ్యవసాయ అధికారి బి.సుమలత, సచివాలయం కో-కన్వీనర్ కనితి దుర్గారావు, వైసిపి మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ పాల్గొన్నారు.

పలుచోట్ల 'వాలంటీర్లకు వందనం'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వాలంటీర్లకు అభినందన కార్యక్రమాన్ని ఎంపిడిఒ ప్రవీణ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వాలంటీర్లకు పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి సేవా మిత్రా, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమల దేవి, వేలేరుపాడు ఎంపిపి వల్లా లక్ష్మీదేవి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.రామతులసి, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, తెల్లం వెంకటలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కెవిఎస్ఎన్.కుమార్, వ్యవసాయాధికారి బి.సుమలత, సచివాలయం కో-కన్వీనర్ కనితి దుర్గారావు, వైసిపి మండల కో-కన్వీనర్ అల్లూరి రత్నాజీ పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా వాలంటీర్లు పని చేస్తున్నారని వైసిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద వాలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఐదుగురు వాలంటీర్లకు సేవా రత్న రూ.45 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.నీరజసుధాకర్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచి** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని విస్సంపల్లి వెంకటేశ్వరరావు, వయస్సు : 37 సం॥, తండ్రి: విస్సంపల్లి బొడ్డియ్య, నివాసం :శివపురం గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్ డి లోని చింతలపూడి మండలం, యండపల్లి రెవిన్యూ శివపురం గ్రామ తాలూకా జిరాయతీ మెరక రి.నెం.751-4బి రు దాఖలా **దాక్యుమెంట్ నెం. 11129/2023**, య. 0-16 ట్లులో య.0- 02 ట్లు లేక చ॥గ॥ 96.8 లు స్థలమునకు హద్దులు : **తూర్పు** : డొంక దారి, **దక్షిణము** : విస్సంపల్లి దాసు గారి తాలూకు స్థలం, **పడమర** : విస్సంపల్లి సుజాత గారి స్థలం, **ఉత్తరం** : పంచాయితీ వారి సిమెంట్ రోడ్డు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, ఖమ్మం, 9849246278

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచి** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని తగరం మల్లేశ్వరరావు తండ్రి: తగరం సామేలు, వయస్సు : 40 సం॥, నివాసం : ప్రగడవరం శివారు శ్రీరామపురం గ్రామం, చింతలపూడి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ డి. లోని చరిన ప్రగడవరం పంచాయితీలోని ప్రగడవరం గ్రామం తాలూకా జిరాయతీ మెరక - రి.నెం. 205-2 రు, య 5 -04 ట్లు **దాక్యుమెంట్ నెం. 30/2019** పురాలో మీకు విక్రయించిన చ॥గ॥ 252 లు ఖాళీ నివేశన స్థలంనకు హద్దులు : **తూర్పు** : తగరం భూలక్ష్మీ వగైరాల స్థలం, **దక్షిణము** : ఆర్ అండ్ బి రోడ్డు కొంత వరకు, కొమిరిపాలెపు వేణు గారి స్థలం కొంత వరకు, **పడమర** : రెడ్డి జానకి రాణి గారు వగైరాల స్థలం, **ఉత్తరం** : తమ్మారి ప్రభాకరరెడ్డి గారి స్థలం

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, ఖమ్మం, 9849246278

మహారాజశ్రీ 3వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 192/2023

Between:
ICICI Bank Limited, a Banking Company, constituted under the Companies Act, 1956, having its Registered Office at Landmark Building, Race Course Circle, Vadodra, a Branch in T.Nagar, Rajamahendravaram, represented by its Manager and G.P.A. holder by name Mohammad Althaf Hussain, S/o. Mohammad Sardar, Muslim, aged 38 years, JCJC Rajamahendravaram. ...Plaintiff

AND

Nalajala Syam Prasad, S/o. Satyanarayana, Hindu, aged 34 years, Flat No. 201, Opp. Andhra Bank, Floor No.2, Viswa Mohini Apartment, Subbarao peta, Tadepalligudem - 534101, West Godavari District JCJC, Tadepalligudem. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 04-3-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 20-2-2024
డి.వి.కృష్ణారావు
అడ్వకేట్, రాజమండ్రి

పాస్‌పోర్టు పోయినది

గూటాల ఆశాజ్యోతి, భర్త: రవిబాబు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. మునమర్రు నుండి పెనుగొండ వెళుతుండగా నా యొక్క EC Passport No. X0628060 గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

అడ్రస్:
గూటాల ఆశాజ్యోతి
భర్త: రవిబాబు
డోర్ నెంబర్: 2-38, మునమర్రు
పశ్చిమగోదావరి జిల్లా, పిన్: 534324
సెల్: 8978779313

పాస్‌పోర్టు పోయినది

కొంబత్తుల వెంకటలక్ష్మి, భర్త: నర్సింహస్వామి అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. తూర్పుగరువు, పెనుమంచిలి నుండి ఆచంట వస్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్: U1849947 గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

అడ్రస్:
కొంబత్తుల వెంకటలక్ష్మి
భర్త: నర్సింహస్వామి, ఇంటి నెంబర్: 7-45/0
తూర్పుగరువు, ఆచంట మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్: 534123
సెల్: 9701300534